క్లుప్తంగా

పోరంకిలో నిత్యావసర సరుకుల పంపిణీ



పెనమలూరు: పోరంకి గ్రామంలోని అనాథాశ్రమంలో ఉన్న పిల్లలకు శుక్రవారం దాతలు నిత్యావసర సరుకులు అందజేశారు. బ్యాంకు ఉద్యోగులు, మాజీ సైనికోద్యోగులు కలిసి ఏర్పాటు చేసిన లైక్ మైండెడ్ పీపుల్స్(ఎల్ఎంపీ) ఆధ్వర్యంలో చిన్నారులకు పండ్లు, స్వీట్లు, రూ. 15 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రానున్న కాలంలో ఎల్ఎంపీ సేవా సంస్థ నుంచి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని గ్రూప్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కానూరు యూనియన్ బ్యాంకు అధికారులు వి. శ్రీనివాస్, బీవీజీ మూర్తి, జి. ప్రసాద్, శివరామకృష్ణ, రామకృష్ణ తదితరలు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

విజయవాడరూరల్: పంటలను సాగు చేసే రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథబాబు శుక్రవారం ఒక ప్రకటనలో రైతులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులందరూ సకాలంలో పంట నమోదు చేసుకోవాలని సూచించారు. పట్టాదారు పాస్ బుక్, సాగుదారు ఆధార్ కార్డ్, ఫోను నెంబర్, బ్యాంక్ పాస్ పుస్తకంతో రైతు సేవా కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

వైభవంగా జెండా పూజా మహోత్సవం

కంకిపాడు: మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో వేంచేసిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి జెండా పూజా మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా రూపొందించిన స్వామివారి జెండాను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ జెండాను భక్తిశ్రద్ధలతో గ్రామంలోని ప్రధాన కూడలిలో గల వీరబ్రహ్మేంద్రస్వామి ధ్వజస్తంభంపై ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన వీరమాచనేని నాగరాధాకృష్ణ, సౌమ్య దంపతులతో ప్రత్యేక పూజలు, జెండా పూజా మహోత్సవం కనులపండువగా సాగింది.

ఉయ్యూరులో అన్న క్యాంటీన్ ప్రారంభం



ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలోని పాత వాటర్ ట్యాంకు వద్ద ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్లల్లో రూ. 5కే పేదలకు భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), మాజీ చైర్మన్ జంపాన పూలా, వార్డు కౌన్సిలర్ పలియాల శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు జంపాన గుర్నాథరావు, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ అచీవ్‌మెంట్ సర్వే నిధులు జమ

గన్నవరం: మండలంలో స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే నిధుల స్వాహాపై సాక్షిలో వచ్చిన ''విద్యాశాఖ అధికారి కక్కుర్తి వ్యవహారం'' కథనానికి స్పందన లభించింది. ఈ విషయాన్ని సాక్షి వెలుగులోకి తీసుకురావడంతో సదరు మండల విద్యాశాఖ అధికారిణి-2 దిద్దుబాటు చర్యలకు దిగింది. గతేడాది నవంబర్‌లో స్టేట్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా విద్యార్థులకు అభ్యసన సామర్థ్య పరీక్షలు నిర్వహించింది. దీని నిమిత్తం ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు భోజనం, ఇతర ఖర్చులకు రూ. 28 వేలు ఎంఈఓ-2 బ్యాంక్ ఖాతాకు విద్యాశాఖ జమచేసింది. ఆ నిధులను ఆయా పాఠశాలల యాజమాన్యాలకు, హెచ్ఎంలకు చెల్లించాల్సి ఉంది. అయితే ఆ నిధుల్లో కొంత మందికి చెల్లించి, మిగిలిన వారికి జమచేయలేదు. దీనిపై సాక్షిలో వచ్చిన కథనంతో ఎంఈఓ-2 అప్పటికప్పుడు సదరు పాఠశాలల హెచ్ఎంల ఖాతాలకు ఆన్‌లైన్ విధానంలో నగదును జమచేశారు.

రంజింపజేసిన వీణాగానం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన ఎస్. సుజాత బృందం వీణాగానం భక్తులను రంజింపజేసింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఎస్.సుజాత బృందం పలు కీర్తనలను వీణపై మృదుమధురంగా గానం చేశారు. సుజాతకు ఎన్ఎస్ కల్యాణరావు, హరిబాబు చక్కటి సహకారం అందించారు.

రైతులకు సాగునీటి కష్టాలు

గొల్లపూడి కాల్వ నీటి కోసం ఎదురుచూపులు

నీరులేక ఎండిపోతున్న వరి పొలాలు

విజయవాడరూరల్: జిల్లాలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకాల్లో ఒకటైన గొల్లపూడి ఎత్తిపోతల పథకం ఆయకట్టు పరిధిలోని గ్రామాల రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. వేలాది ఎకరాల వ్యవసాయ పంట భూములకు సాగునీరు అందించాల్సిన గొల్లపూడి ఎత్తిపోతల పథకం ద్వారా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఒక చుక్క నీరు కూడా రాకపోవడంతో రైతాంగం ఇబ్బంది పడుతోంది. గొల్లపూడిలో కృష్ణానది నుంచి ఐదు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోయాల్సి ఉండగా అందులో కేవలం రెండు మాత్రమే పని చేస్తున్నాయి. ఎత్తిపోతల పథకం నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. కాల్వలో దట్టంగా పెరిగిన తూటుకాడను ఎండాకాలంలోనే తొలగించాల్సి ఉండగా ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఇప్పటికీ తూటుకాడ అలాగే ఉంది. కాల్వ అభివృద్ధి పనులు చేపట్టలేదు. గొల్లపూడి ఎత్తిపోతల కాల్వ పరిధిలో గొల్లపూడి, భవానీపురం, విద్యాధరపురం, జక్కంపూడి, అంబాపురం, పి.నైనవరం, పాతపాడు, వీలేజీ కండ్రిక, నున్న, ముస్తాబాదు గ్రామాల్లో సుమారు ఏడు వేల ఎకరాల ఆయకట్టు ఉండేది. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములు కొనుగోలు చేసి ప్లాట్లు వేయడంతో సుమారు మూడు వేల ఎకరాలు తగ్గిపోయింది. ఈ కాల్వ పరిధిలో సబ్‌లిఫ్టులు రెండు ఉన్నాయి. ఒకటి పాతపాడు గ్రామంలో జైకిసాన్ ఎత్తిపోతల పథకం, నున్న గ్రామంలో రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం ఉండగా వాటి పరిధిలో మరో ఐదు వేల ఎకరాలు సాగు చేసే రైతులు గొల్లపూడి కాల్వ పైనే ఆధారపడి ఉన్నారు. అందులో సన్న, చిన్న కారు, కౌలు రైతులే అధికంగా ఉన్నారు.



గొల్లపూడి కాల్వలో దట్టంగా పెరిగిన తూటుకాడ

ఆందోళన చెందుతున్న రైతులు..

గొల్లపూడి ఎత్తిపోతల పథకం ప్రారంభం నుంచి అనగా 1972వ సంవత్సరం నుంచి గత ఏడాది వరకు కాల్వ ద్వారా సాగునీరు గ్రామాలకు అందుతూనే ఉంది. సాగునీరే కాకుండా కొన్ని గ్రామాల ప్రజలు తాగు నీరుగా కూడా ఈ కాల్వ నుంచి వచ్చే నీటినే వినియోగించుకొంటున్నారు. అయితే ఈ ఏడాది మాత్రం సాగు నీరు విడుదల కాకపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. అడపాదడపా కురిసిన వర్షానికి వరినాట్లు వేసుకున్న రైతులు మొదటి దశలోనే పంటపొలాలకు నీరులేక ఎండిపోయే పరిస్థితులు నెలకొనడంతో ఆందోళన చెందుతున్నారు. నీరు లేకపోవడంతో వరి పొలాల్లో కలుపు పెరిగి వ్యవసాయ ఖర్చులు అధికం అవుతున్నాయని వాపోతున్నారు. గొల్లపూడి కాల్వ ద్వారా సాగునీరు విడుదల చేయాలని నున్న గ్రామం నుంచి కొందరు రైతులు ఇటీవల స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌ను కలవడం జరిగింది. ఐడీసీ అధికారులతో మాట్లాడి మోటార్లు రిపేరు చేయించి, కాల్వలో తూటుకాడ తొలగించి సాగునీరు అందించేందుకు చర్యలు చేపడతామని చెప్పినా, ఇంతవరకు ఎలాంటి పనులు ప్రారంభం కాలేదని రైతులు అంటున్నారు. పంట పొలాలకు సాగునీరు అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



నీరు లేని గొల్లపూడి కాల్వ

ఘనంగా శ్రావణమాస ఉత్సవాలు



శ్రీలక్ష్మీతిరుపతమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలో కొలువైన శ్రీలక్ష్మీతిరుతపమ్మ ఆలయంలో శ్రావణమాసం రెండవ శుక్రవారం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. శ్రీలక్ష్మీతిరుతపమ్మతో పాటు ఆలయ ప్రాంగణంలోని మాను(మహాలక్ష్మీ)కి పూజలు చేసి గ్రామ పొంగళ్లను సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో శ్రీలక్ష్మీ సహస్రనామ పూర్వక కుంకుమార్చనలు చేశారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు, సీఐ బీవీ శివప్రసాద్, ఎస్ఐ కనక దుర్గ, సర్పంచి నిడమర్తి సౌజన్య, పలువురు రాజకీయ, పట్టణ ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి వలంటీర్లతో తాగునీరు, ప్రసాద వితరణ జరిగాయి. పూజా కార్యక్రమాల అనంతరం శ్రీలక్ష్మీ తిరుతపమ్మ సమేత గోపయ్య స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రభబండితో ఊరేగింపుగా బయలుదేరిన భక్తులు

ప్రభల ఊరేగింపు..

తీన్‌మార్ డప్పులు, డీజే సాంగ్స్, కోలాట, డప్పు కళాకారుల నృత్య ప్రదర్శనలు, యువకుల కోలాహలం మధ్య సాయంత్రం నుంచి ప్రభల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. సుమారు 17 వరకు ప్రభల బండ్లు గ్రామ వీధుల నుంచి జాతీయ రహదారి మీదుగా రాత్రికి శ్రీలక్ష్మీతిరుతపమ్మ ఆలయానికి చేరుకున్నాయి. యువ ఫ్రెండ్ సర్కిల్ ప్రభను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. చిమట గంగాధర్, గోపి, పిన్నిబోయిన రమేష్, చెన్ను బాబీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి ఆలయంలో రెండవ శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి అభిషేకం చేసి విశేషంగా అలంకరించి వరలక్ష్మీ వ్రతం చేశారు. అనంతరం భక్తులు చండీహోమం చేశారు. సాయంత్రం భక్తులు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన అత్యంత వైభవంగా చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా మండల పరిధిలోని ఆలయాలు శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కాగా పెదపులిపాకలోని శ్రీ విజయ రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు.



యనమలకుదురులో పార్వతీదేవి అమ్మవారు

పేరంటాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం శుక్రవారం భక్తులతో కిక్కిరిసింది. శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పేరంటాలమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలువురు మహిళలు ఆలయ ప్రాంగణంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సర్దార్ గౌతులచ్చన్నకు నివాళి

పెనమలూరు: యనమలకుదురులో శుక్రవారం సర్దార్ గౌతులచ్చన్న జయంతి ఘనంగా చేశారు. గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొని గౌతులచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ గౌతులచ్చన్న పేద బడుగు బలహీన వర్గాలకు అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకర్‌బాబు, అనంతనేని ఆజాద్ పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలో పలు చోట్ల సర్దార్ గౌతులచ్చన్న జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. సర్దార్ గౌతులచ్చన్న సేవా సమితి అధ్యక్షుడు కాగిత కొండ(జేమ్స్) ఆధ్వర్యంలో ప్రధాన సెంటరులోనూ, టీడీపీ పట్టణ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొని లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లచ్చన్న అభిమాన సంఘం నేత రాజులపాటి ఫణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెనిగళ్ల వెంకట కుటుంబరావు, కౌన్సిలర్లు తెనాలి పద్మావతి, కూరాడ వెంకటలక్ష్మి, జంపాన శ్రీనివాసరావు, వీరంకి చింతయ్య, సయ్యద్ అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో గౌతులచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైవీబీ తదితరులు

వివాహిత అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వివాహిత అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరిపాలెం మర్రిచెట్టు సెంటర్‌కు చెందిన పుసుపులేటి గౌతం ట్రావెల్స్ నడుపుతున్నాడు. రెండేళ్ల క్రితం ఎం. అఖిలను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆమె డిగ్రీ వరకు చదువుకుంది. ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్ ఎస్ఆర్ నగర్‌లో రికవరీ ఏజెంట్‌గా ఆమెకు జాబ్ వచ్చింది. దీంతో గౌతం తన భార్యను హైదరాబాద్‌కు ఉద్యోగానికి పంపించాడు. అక్కడికి వెళ్లిన తర్వాత ఆమెకు మరో యువకుడితో పరిచయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న గౌతం తన భార్యను ఉద్యోగం మానిపించి ఈనెల ఆరో తేదీన ఇంటికి తీసుకువచ్చాడు. గురువారం ట్రావెల్స్ పనిమీద ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య ఇంట్లో లేదు. చుట్టుపక్కల వెదికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో గౌతం తన భార్య కనిపించడం లేదంటూ భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు: ఉంగుటూరు సబ్‌స్టేషన్‌లో సాధారణ మరమ్మతుల నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సూర్యప్రకాశరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఉంగుటూరు, ఎలుకపాడు, లంకపల్లి, కొయ్యగూరపాడు, నాగవరప్పాడు, మానికొండ, ఇందుపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

చెస్ క్రీడాకారిణికి నగదు ప్రోత్సాహకం



గన్నవరం రూరల్: క్రీడాకారులకు సాయం అందించడం అందరి బాధ్యత అని ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమి చైర్మన్ బొబ్బా రత్నారావు అన్నారు. శుక్రవారం విజయవాడకు చెందిన ఏపీ జూనియర్ చెస్ ఛాంపియన్ సీహెచ్ శర్వాణీకి దాత మేచినేని సత్యన్నారాయణ రూ.6వేలు నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఎస్‌వీ రామ గోపాల్, షేక్ సుభాని, విశ్రాంత హెచ్ఎం ఎంవీ సుబ్బారావు, పలువురు ఉపాధ్యాయులు, గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్‌ను అవమానించింది

గన్నవరం: స్వాతంత్ర్య దినోత్సవం రోజున రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిందని దళిత, బహుజన పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వర రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో నగరం నడిబొడ్డున ఉన్న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద కనీసం జాతీయ జెండాను ఎగురవేయకపోవడం దారుణమన్నారు. పక్కనే ఉన్న గవర్నర్ భవన్, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ కార్యాలయాలు, ఇందిరాగాంధీ స్టేడియానికి విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారని, కానీ అంబేద్కర్ స్మృతి వనాన్ని మాత్రం చీకటి మయంగా ఉంచడం ఆయనపై పాలకులకు ఉన్న కపట ప్రేమకు నిదర్శనమన్నారు. ఇటీవల ఏపీ హైకోర్టు జడ్జిల సమావేశంలో దళిత వర్గానికి చెందిన న్యాయమూర్తిని నిలబెట్టి మంత్రి కొల్లు రవీంద్ర కూర్చోవడం కూడా దళితులను కించపరచడమేనని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి వివక్షతను విడనాడాలని సూచించారు.

19న మాలల సమావేశం

పటమట(విజయవాడతూర్పు): ఎస్సీ రిజర్వేషన్‌పై సుప్రీం కోర్టు తీర్పును పునఃసమీక్షించుకోవాలని కోరుతూ ఈ నెల 19న ఉదయం 10 గంటలకు విజయవాడ నగరంలోని స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో మాలల సమావేశం నిర్వహిస్తున్నట్లు మాలమహానాడు అధ్యక్షుడు పంతగాని రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంటి తలుపులు పగలకొట్టి చోరీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంటి తలుపులు పగలకొట్టి ఇంట్లోని సుమారు రూ. 1.65 లక్షల విలువైన నగదు, బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేసిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుణదల మురళీనగర్‌కు చెందిన కొంకిమల్ల శివరామకృష్ణ తినుబండారాల వ్యాపారి. ఆయన ఈ నెల 14వ తేదీన కుటుంబ సభ్యులతో గుంటూరు వెళ్లారు. 15వ తేదీ రాత్రి 11 గంటలకు తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు పగలకొట్టి కనిపించాయి. ఇంట్లో సామగ్రి చిందర వందరగా ఉంది. బీరువాలో ఉండాల్సిన నగదు రూ. లక్షా ఇరవై వేలు, 9గ్రాముల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి ఆభరణాలు కనిపించలేదు. దీంతో శుక్రవారం శివరామకృష్ణ గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ వాసిరెడ్డి శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికీ నీటి కుళాయి కనెక్షన్ ఇవ్వడానికి ప్రత్యేకంగా సర్వే నిర్వహిస్తున్నామని వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 16 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఫంక్షనల్ హౌస్‌హోల్డ్ ట్యాప్ కనెక్షన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి పరిశీలించారు. అనంతరం కమిషనర్ వివరాలు తెలుపుతూ.. పోరంకి, కానూరు, యనమలకుదురు, తాడిగడప గ్రామాల్లో అడ్మిన్ సెక్రెటరీ, ఎమినిటీ సెక్రెటరీ సర్వే నిర్వహిస్తారన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కుళాయి కనెక్షన్ ఉందా లేదా అని సర్వే చేస్తారు. అదేవిధంగా పైప్‌లైన్ విస్తరణపై వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. సర్వేకి మున్సిపాలిటీలోని ప్రజలు సహకరించాలని కోరారు.



కానూరులో సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

వచ్చే నెలలో అశోక్ లేలాండ్ ప్లాంట్ పునఃప్రారంభం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో నిర్మించిన అశోక్ లేలాండ్ బస్సు బాడీ బిల్డింగ్ యూనిట్‌ను వచ్చే నెలలో పునఃప్రారంభించనున్నట్లు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గన్నవరంలోని ఆయన క్యాంపు ఆఫీస్‌లో అశోక్ లేలాండ్ కంపెనీ ప్రతినిధులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. మల్లవల్లిలో 75 ఎకరాల్లో రూ. 130 కోట్లతో బస్సు బాడీ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటు చేశామని, ప్రస్తుతం ప్లాంట్ పునఃప్రారంభం కోసం మరో రూ. 10 కోట్లతో శరవేగంగా పనులు పూర్తి చేస్తున్నామని అశోక్ లేలాండ్ ప్రతినిధులు యార్లగడ్డకు తెలిపారు. యార్లగడ్డ మాట్లాడుతూ మల్లవల్లి పారిశ్రామికవాడలో అశోక్ లేలాండ్ పునఃప్రారంభమైతే ఈ ప్రాంతంలో ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. సమీక్షలో అశోక్ లేలాండ్ హోసూరు ప్లాంట్ హెడ్ శ్రీధరన్, కార్పొరేట్ ప్రాజెక్టు ప్లానింగ్ టీం హెడ్ కృష్ణన్, అల్వార్ ప్రొడక్షన్ హెడ్ మహీంద్ర సింగ్, హెచ్ఆర్ సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారాలు





జేసీ నుంచి అవార్డులు స్వీకరిస్తున్న సవలం బాబు, డాక్టర్ మాధవరావు

కంకిపాడు: విశిష్ట సేవలు అందించిన పలువురికి జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులు లభించాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీ గీతాంజలి శర్మ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. వీరిలో ఈడుపుగల్లు పశువైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ కర్నాటి మాధవరావు కంకిపాడు, కుందేరు, ఈడుపుగల్లు గ్రామాల్లో విశిష్ట సేవలు అందించినందుకు ఉత్తమ అవార్డు లభించింది. 108 అంబులెన్సులో పనిచేస్తున్న కంకిపాడు ఈఎంటీ సవలం బాబు జిల్లా స్థాయి ఉత్తమ ఈఎంటీగా జేసీ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

సాధారణ స్థితికి ఏటిపాయ

కంకిపాడు: ఏటిపాయలో సాధారణ పరిస్థితి నెలకొంది. ఎగువ నుంచి వరదనీరు విడుదల ఆగిపోవడంతో ఏటిపాయలో పూర్తిగా నీటి ప్రవాహం తగ్గింది. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల వెంబడి ప్రవహించే కృష్ణానది ఏటిపాయలో వారం రోజులు పాటు వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. వరదనీటి విడుదల నిలుపుదలతో ఏటిపాయలో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. కరకట్ట నుంచి ఏటిపాయకు వెళ్లే రహదారికి అనుసంధానంగా ఏటిపాయలో అవతలి వైపున ఉన్న లంక భూముల్లోకి వెళ్లేందుకు, ఇసుక రవాణా చేసేందుకు రబ్బిష్ రోడ్డు నిర్మించారు. వరదధాటికి ఆ రోడ్డు మార్గం మునిగిపోయింది. అయితే ప్రస్తుతం రోడ్డు మార్గం పూర్తిగా బయటపడింది. లంక భూముల్లోకి వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు, కూలీలు రాకపోకలు సాగిస్తున్నారు. పశువులు, గొర్రెల కాపరులు జీవాలను ఏటిపాయలోని లంక భూముల్లోకి తోలుకువెళ్తున్నారు. ఏటిపాయ పూర్తిగా తగ్గడంతో అందులో చేపల వేట సాగించేందుకు మత్స్యకారులు తమ పడవలను ఏటి ఒడ్డున నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాలకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు.



మద్దూరు వద్ద ప్రస్తుతం ఏటిపాయ

కోనోకార్పస్ మొక్కలు తొలగించాలి

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో పర్యావరణానికి ప్రమాదకరంగా ఉన్న కోనోకార్పస్ మొక్కలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోసనం రాము అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావుకు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం రాము వివరాలు తెలుపుతూ మున్సిపాలిటీ పరిధిలో కోనోకార్పస్ మొక్కలు రహదారికి ఇరుపక్కలా ఉన్నాయన్నారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయ ఆవరణల్లో కూడా మొక్కలు ఉన్నాయని తెలిపారు. ఈ మొక్కల వల్ల పర్యావరణానికి ప్రమాదమే కాకుండా, మానువులకు క్యాన్సర్ వంటి వ్యాధులు రావడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రమాదకరంగా ఉన్న కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని కోరారు.



కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతిప్రం అందజేస్తున్న రాము

వాయిద్య కళాకారుల సంక్షేమానికి కృషి

విజయవాడ కల్చరల్: వాయిద్య కళాకారుల సంక్షేమానికి కృషి చేయనున్నట్లు న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. అయోధ్యనగర్‌లోని వాయిద్య కళాకారుల సంఘ కార్యాలయంలో వాయిద్య కళాకారుల సమ్మేళనం, కళాకారుల ఆత్మీయ సమావేశం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలోని అనేక దేవాలయాల్లో వాయిద్య కళాకారుల పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. కళాకారులు ఐక్యంగా పనిచేయాలని అప్పుడే విజయాలు సాధించగలమని తెలిపారు. వాయిద్య కళాకారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు యలమందరావు మాట్లాడుతూ న్యాయ సలహాల కోసం న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తాను నియమించామని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్ రామ్మోనరావు, సంస్థ సభ్యులు సూరవరపు నాగరాజు, లంక మహేష్, ఆకునూరు సుబ్బారావు, సీతయ్య, రఘునాథ్, కేవీ రామారావు పాల్గొన్నారు. జిల్లా నుంచి వచ్చిన వాయిద్య కళాకారుల బృందాలు వాగ్గేయకార కీర్తనలను పలికించారు. హజరత్తయ్యగుప్తాను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.



న్యాయవాది హజరత్తయ్య గుప్తాను సత్కరిస్తున్న నిర్వాహకులు